క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు: మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు విద్యుత్తు సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 33కేవీ, 11 కేవీ ఫీడర్లలో మరమ్మతుల పనులకోసం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాజుపాళెం మండలంలో...

రాజుపాళెం: మండలంలోని అన్ని సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగ దారులంతా సహకరించాలని ఆయన కోరారు.

రేపు మెగా జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో ఈ నెల 10న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నాగార్జున ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ టి.సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలు పాల్గొంటున్నాయని ఆయన వివరించారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ పాసైన అభ్యర్థులు జాబ్ మేళాలలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు మురళీధర్ రావు 9666291564, 8197813014కు సంప్రదించాలని తెలిపారు.

జెడ్పీ సీఈఓ తనిఖీ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సి.ఓబులమ్మ

ప్రొద్దుటూరు: స్థానిక హౌసింగ్ బోర్డులోని మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ సి.ఓబులమ్మ శుక్రవారం సందర్శించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ సూర్య నారాయణరెడ్డితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏపీఓ మహేంద్రరెడ్డితో చర్చించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సీఈఓ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

వార్డులలో కమిషనర్ పర్యటన

ప్రొద్దుటూరు: పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శుక్రవారం పర్యటించారు. విజయనగరం వీధిలో ఇంటింటా చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. కాలువలను పరిశీలించి షిల్ట్ తొలగించాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. దేవాంగపేట కల్వర్టుకు గ్రిల్ ఏర్పాటు చేయాలని, అదే ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. చౌడమ్మ గుడి వద్ద హౌస్ హోల్డ్ సర్వేను ఆయన పరిశీలించారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న సావిశెట్టిపల్లె గ్రామస్తులు

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని భూ సమస్యలను పరిష్కరించాలని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన పేదలు డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సావిశెట్టిపల్లె గ్రామంలో రీసర్వేపై రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ భూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పొదుపు మహిళలకు చదువు

మైదుకూరు: స్వయం సహాయక సంఘాల్లోని 15 ఏళ్ల పైబడిన మహిళలకు విద్య నేర్పించేందుకు ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు 10 మందిని ఒక బ్యాచ్‌గా ఏర్పరచి అక్షరాలు నేర్పిస్తామన్నారు. ఎంఈఓ-2 నరహరిశర్మ, సీడీపీఓ శ్రీదేవి, సుజాత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చాపాడు: చదువుతోనే సమాజంలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని, గతంలో చదువు నేర్చుకోని వారు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మళ్లీ చదువు నేర్చుకోవచ్చని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం వయోజన విద్యాశాఖ ద్వారా ఉల్లాస్ పేరుతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చదువు నేర్పించేందుకు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో లక్షుమయ్య, సావిత్రమ్మ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని మలుగుడిపాడు గ్రామ సమీపంలో శుక్రవారం ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించగా గ్రామ సమీపంలోని కంపచెట్లతో జూదమాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,210 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాల ధారణం .. నియమాల తోరణం

కార్తిక మాసం మొదలు మకర సంక్రాంతి వరకు అయ్యప్ప దీక్షల కోలాహలం కనిపిస్తోంది. ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాలను మేళవింపజేసే అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైనది. స్వామి దర్శనానికి ముందు 18 మెట్లు అధిరోహించడం ద్వారా అజ్ఞానం తొలగి స్వామి అనుగ్రహం లభిస్తుందని దీక్షధారుల నమ్మకం.

ఏటా పెరుగుతున్న అయ్యప్ప దీక్షాధారులు



బాలాయపల్లెలో అయ్యప్పస్వామికి పడిపూజ చేస్తున్న మాలాధారులు

కాశినాయన: విలువలు పెంపొందించేందుకే అయ్యప్పదీక్ష దోహదపడుతుంది. మాల ధారణ, నల్లని వస్త్రధారణ, చన్నీటి స్నానం, విభూది, చందనం, కుంకుమతో అలంకరించు కోవడం ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. శరీరంపై భస్మాధారణ ఈశ్వరుడి సంకేతానికి, నుదుటిపై మెరిసే తిరునామం విష్ణుమూర్తిని గుర్తుచేస్తాయి. అయ్యప్ప దీక్ష మనిషిలోని చెడు గుణాన్ని తొలగించి మంచి గుణాలను పెంపొందించి జీవన విధానంలో మార్పు కనిపించేలా చేస్తుంది.

ఆరోగ్య ప్రయోజనాలు

41వ దీక్ష ద్వారా ఆరోగ్య మెరుగుపడుతుంది. భక్తిభావంతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది అయ్యప్ప దీక్షలను తీసుకుంటారు. ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీకగా సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానం నాడీ వ్యవస్థను ఉత్తేజపరచడం, నేలమీద పడుకోవడం, కందరాల ప్రతిష్ఠత, రక్తప్రసరణ మెరుగునకు దోహదపడుతుంది. నిత్య దీపారాధనతో మనస్సు తేలిక పడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పొగత్రాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండటం వలన ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయ్యప్ప మాల ధరించిన భక్తులు కార్తీకమాసం మొదటి రోజు నుండి మకర సంక్రాంతి వరకు భజనలు చేస్తూ స్వామి కృపకు పాత్రులవుతారు.

పాపాలు తొలగిపోతాయని నమ్మకం



అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు రోజురోజుకూ పెరుగుతున్నారు. మాల ధరించినప్పటి నుండి భక్తి శ్రద్ధలతో 41 రోజులు కఠిన దీక్ష ఉండి ఇరుముడిని కట్టుకని పంబానదిలో స్నానం చేస్తే చేసిన పాపాలు తొలగిపోతాయని నమ్మకం. – బాలవెంకటరెడ్డిస్వామి, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

స్నేహభావం పెరుగుతుంది



అయ్యప్ప మాల ధారణ జీవన ప్రమాణాలను పెంచుతుంది. ప్రతి ఒక్కరు తమ విధిని గుర్తిస్తారు. సంఘజీవి ఎలా ఉండాలో నేర్చుకుంటారు. తోటి వారిని ఎలా గౌరవించాలో అలవరుచుకుంటారు. పూజలు, భజనల ద్వారా స్నేహభావం పెరుగుతుంది. –నరసింహులుస్వామి, వరికుంట్ల

బీడు భూములు పచ్చని పైర్లతో ఉండాలి

అట్లూరు: బీడు భూములను సైతం పైర్లు సాగు చేసేలా రైతులను చైతన్య పరచాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో బద్వేలుతో పాటు అట్లూరు, సిద్దవటం, గోపవరం మండలాల వ్యవసాయ అధికారులకు ఆయన శిక్షణతోపాటు సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. భూసార మరియూ సాగునీటి పరీక్ష ప్రాధాన్యత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, రామకృష్ణయ్య, బి.మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

16న ఎమ్మార్పీఎస్ మహాసభ

ప్రొద్దుటూరు: ఈ నెల 16న విజయవాడలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాదిగ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చెన్నమ్మ మాదిగకోరారు. స్థానిక ఎర్రన్నకొట్టాలలో శుక్రవారం సభ కర పత్రాలను ఆయన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా రెండు రాష్ట్రాల పాలకులు కాలయాపన చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకులయ్య, రంగనాయకులు, బెనర్జీ, నారాయణ, రామాంజి, రమేష్, శ్రీకాంత్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుకు రాయితీ

విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ

మైదుకూరు: విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీని ఇస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో మైదుకూరు డివిజన్‌లోని మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు, పోరుమామిళ్ల, కలసాపాడు, కాశినాయన, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, బ్రహ్మంగారిమఠం, అట్లూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో ప్రగతిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ఈ రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ఒక కిలోవాట్ సామర్థ్యంకు రూ.30 వేలు, రెండు కిలో వాట్స్ సామర్థ్యంకు రూ.60వేలు, మూడో కిలో వాట్స్ సామర్థ్యంకు రూ.78 వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని, వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ పాల్గొన్నారు.

బి.కోడూరు: రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాయలకుంట్ల సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లకు అందుతున్న సరఫరా, విద్యుత్ వైర్ల మరమ్మతులు, సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లో ఎటువంటి లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు సరిచూసుకోవడంతో పాటు వారి వారికి కేటాయించిన విద్యుత్ ఫీడర్లను కూడా సిబ్బంది సరిచేసుకోవడం వలన విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే సంఖ్య చాలా వరకు తగ్గుతుందనితెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డీఈ భరణికృష్ణ, ఏడీ రవిచంద్రన్, ఏఈ సుబ్బరాయుడు, లైన్‌మెన్ పవన్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : విద్యుత్ అంతరాయాలను జీరో చేయాలని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్లలో విద్యుత్‌సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పగటిపూట వీధి లైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

చాపాడు: కోళ్ల వ్యాపారం చేస్తున్న నంద్యాలకు చెందిన శ్రీనివాస గౌడ్ అనే వ్యక్తిపై మోసం చేశాడనే కారణంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. మండలం పరిధిలోని కేతవరం గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు ఖాదర్‌వల్లి అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా కోళ్ల వ్యాపారం చేసుకుంటున్నాడు. 2020-22 వరకూ నంద్యాలకు చెందిన శ్రీనివాస గౌడ్ అనే వ్యాపారి ఖాదర్‌వల్లి దగ్గర బ్రాయిలర్ కోళ్లను కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస గౌడ్ రూ.1.90 లక్షల వరకూ కోళ్లను తీసుకెళ్లి డబ్బులు ఇవ్వలేదు. రెండేళ్లుగా డబ్బులు ఇస్తానని చెబుతూ కాలయాపన చేయడంతో పాటు ఇటీవల కాలంలో డబ్బులు ఇవ్వనని, అడిగితే చంపేస్తానని బెదిరించడంతో బాధితుడు ఖాదర్‌వల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

చార్జీల పెంపు వద్దు

ప్రొద్దుటూరు: విద్యుత్తు ఛార్జీల పెంపును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలకే ప్రజలపై ట్రూ అప్ పేరుతో విద్యుత్తు చార్జీల భారం మోపడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, సర్వేశ్వరి, ముంతాజ్‌బేగం, విజయకుమార్, సాల్మన్, శేఖర్, భానుమతి, వెంకటసుబ్బమ్మ, చెన్నారెడ్డి,మహబూబ్ బాషా, డేవిడ్ పాల్గొన్నారు.

విరాళాల కోసం క్యూఆర్ కోడ్

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో భక్తులు నేరుగా బ్యాంక్ ఖాతాకు విరాళాలు జమచేసేందుకు క్యూఆర్ కోడ్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మఠం పిట్ పర్సన్ శంకర్‌బాలాజీ మాట్లాడుతూ మఠం అభివృద్ధి కోసం భక్తులు విరాళా ఇవ్వాలంటే నేరుగా క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేస్తే దేవస్థానం ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ ఈశ్వరాచారి, మఠం పూర్వపు మఠాధిపతి కమారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు శ్మశానానికి దారి

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రం బ్రహ్మంగారిమఠంలో ఉన్న హిందూ స్మశానంకు దారిలేక స్థానికులు ఇబ్బందులు పడేవారు. అధికారులు, స్థానిక వివిధ పార్టీల నాయకుల సహకారంతో ఎట్టకేలకు స్మశానంకు శుక్రవారం దారి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, భోలా శ్రీను, సీపీఎం నాయకుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కోడూరు చెన్నమ్మ

బి.కోడూరు: మండలంలో చాలా వరకు ఆయకట్టు రోడ్లు అధ్వాన్న పరిస్థితిలో ఉన్నారని, ఉపాధి నిధుల ద్వారా వాటిని బాగు చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ దిశగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని ఎంపీపీ కోడూరు చెన్నమ్మ తెలిపారు. శుక్రవారం బి.కోడూరులోని ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్నిశాఖల అధికారుల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇంత వరకు ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని, ఎలాంటి నిధులు కూడా ప్రభుత్వం కేటాయించలేదన్నారు. కనీసం ఉపాధి నిధుల ద్వారా అయినా అధ్వాన్నంగా ఉన్న ఆయకట్టు రోడ్లను పునరుద్దరించేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేయాలని, ఆ విధంగా నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాలని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షులు మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు మధు నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం తగదని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలుగాకముందే అభివృద్ధి చేయలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించడం సబబు కాదన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.10 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంతరం ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో భావితరాలకు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎ.రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గౌరమ్మ వ్రతం



గౌరమ్మ వ్రతం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం గౌరమ్మ వ్రతం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశ్వనాథుల ప్రసాద్, తులసి సుధాకర్ మాట్లాడుతూ గౌరమ్మ వ్రతం 9 రోజులు జరుగుతుందని, ఈనెల 16న శనివారం ముగుస్తుందన్నారు.

వలస కార్మికులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేయాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బద్వేలు అర్బన్: బి.కోడూరు మండలం క్రాస్‌రోడ్డు వద్ద నివాసమున్న పేదలకు, పి.పి.కుంట వద్ద నివాసమున్న వలస కార్మికులకు ఇళ్ళపట్టాలు పంపిణీ చేసి మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డి.వెంకటేష్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ బి.కోడూరు మండలం క్రాస్‌రోడ్డు వద్ద కామకుంట రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 14లో గత 8 సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారందరికి ఇళ్ళ పట్టాలు ఇవ్వడంతో పాటు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బి.కోడూరు, గోపవరం మండలాల కార్యదర్శులు ఓబయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు ఇవ్వండి

అట్లూరు: ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం జరిగే ప్రజా ఉద్యమాలను బలపరచడానికి విరాళాలు ఇవ్వాలని సీపీఎం మండల కన్వీనరు రమణ తెలిపారు. మండల పరిధిలోని అట్లూరు పునరావాస కాలనీ, వరికుంట కాలనీలలో విరాళాల సేకరణకోసం ఇంటింటికి వెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

15 రోజులకు ఒక నీటి తడి చాలు



శనగ పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు

మైదుకూరు: ఎండలు బాగా కాస్తున్నందున శనగ పంటకు 15 రోజులకు ఒక నీటి తడి చాలునని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా శుక్రవారం కేవీకే శాస్త్రవేత్తలు సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు, కసనూరు గ్రామాల్లో చీనీ, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ ఆయా గ్రామాల రైతులతో మాట్లాడుతూ వేరుశనగ పంటకు ఎకరాకు 200 కిలోల జిప్సం వాడాలని సూచించారు. 20 రోజుల తర్వాత, 45 రోజులలోపు రెండు సార్లు కలుపు తీయాలని తెలిపారు. చీనీలో వేరుకుళ్లు, ఆకు ముడత, సూక్ష్మ లోపాలు, మంగును గమనించారు. దాని నివారణకు ట్రైకోడెర్మా రెండు కిలోలు, వేప పిండి 20 కిలోలు, పశువుల పేడ 80 కిలోలు కలిపి చెట్టుకు రెండు నుంచి మూడు కిలోలు వయసును బట్టి పాదులో వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, బీఎస్ కాంతిశ్రీ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం మాజీ బోర్డు మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, సింహాద్రిపురం వ్యవసాయ అధికారి శివమోహన్‌రెడ్డి, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం జరిగిన మూడు మండలాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. గతంలో రావాల్సిన డీఏ, సరెండర్ లీవ్స్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ మొత్తాలను వెంటనే విడుదల చేయాలన్నారు. మూడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

కలసపాడులో భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న డాక్టర్ కాశిరెడ్డి, ఎంఈఓ మస్తాన్‌వలి

కలసపాడు: మండలంలోని ఎగువరామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.15 లక్షలతో నిర్మించిన భోజనశాలను శుక్రవారం ఎంఈఓ మస్తాన్‌వలి, ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలో భోజనశాలను నిర్మించిన దాత డాక్టర్ కాశిరెడ్డి దాతృత్వం స్ఫూర్తిదాయకమన్నారు. కర్ణాటక రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలో సహాయ సంచాలకులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన తంబళ్ళపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ గొంగళరెడ్డికాశిరెడ్డి రూ.15 లక్షలతో భోజనశాలను నిర్మించడం అభినందనీయమని తెలిపారు. దాత కాశిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో గ్రామ అభివృద్ధి, పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామన్నారు. అనంతరం కాశిరెడ్డిని సన్మానించారు. విద్యార్థులకు తిథిభోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ తులసి, రిటైర్డ్ డైటీషియన్ నాలికృష్ణారెడ్డి, హెచ్ఎం కమాల్, ఎస్టీయూ నాయకులు, మాజీ జెడ్పీటీసీ నందిగారి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక



రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైన మహమ్మద్ ఉబైద్‌ను అభినందిస్తున్న ఏజీఎం నాగిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రాజేశ్వరీ కాలనీలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న షేక్ మహమ్మద్ ఉబైద్ జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ ఏజీఎం నాగిరెడ్డి తెలిపారు. శ్రీచైతన్య హైస్కూల్‌లో జరిగిన అభినందన సభలో నాగిరెడ్డి మాట్లాడుతూ గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఉబైద్ ప్రతిభ చూపి బంగారు పతకం సాధించారన్నారు. డిసెంబర్‌లో జరగబోయే జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఉబైద్ పాల్గొంటున్నట్లు తెలిపారు. రైఫిల్ షూటింగ్‌లో మూడేళ్లలో తొమ్మిది స్వర్ణ పతకాలను సాధించాడన్నారు. కోఆర్డినేటర్ మురళి, ప్రిన్సిపాల్ వినోద్ కుమార్, ఇన్‌చార్జి విశ్వనాథ్, సుధీర్ అభినందించారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్: స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్ ఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగిన అనంతరాజుపురం పంచాయతీ ఉప సర్పంచ్ కుప్పాలరమణ కుమారుడు, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ నాయకులు ఎస్.గురుమోహన్ కుమార్తె వివాహ మహోత్సవానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు హాజరై వధూవరులైన వెంకటవినయ్ బాబు, రాజేశ్వరిలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక సంస్థ కీలకపాత్ర



మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్: ఏ పట్టణం అభివృద్ధి చెందాలన్నా అందులో పట్టణ ప్రణాళిక సంస్థ (టౌన్‌ప్లానింగ్) అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, క్రీడామైదానాలు వంటి సౌకర్యాలు అందాలన్నా, ప్రజా జీవనం సాఫీగా సాగేందుకు వీలుగా భవన నిర్మాణాల ఏర్పాటు జరగాలన్నా పట్టణ ప్రణాళిక అధికారుల నిబంధనలు తప్పక పాటించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి సతీష్, ప్లానింగ్ సెక్రటరీలు, పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న నటరాజ కళాక్షేత్రం విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో శ్రీకృష్ణుడు, మళయాల స్వామి, ఎరుకులయ్య, కమలాక్షుమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నట రాజ కళాక్షేత్రం నాట్యగురువు మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, శారద జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్ బాబు రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి



పోరుమామిళ్ల: ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల: పోరుమామిళ్లను కరువు మండలంగా ప్రకటించి వెలుగోడు ప్రాజెక్టు నుండి పోరుమామిళ్ల చెరువుకు నీరు అందించాలని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని, జీబీనగర్ కాలనీ వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీలో సౌకర్యాలు కల్పించాలి

మైదుకూరు: పట్టణంలోని సుందరయ్య కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు కాలనీ పట్ల ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ పేదలు నివసించే సుందరయ్య కాలనీలో వీధి రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. పేదలు 8 ఏళ్లుగా నివాసం ఉంటున్నా వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్ రాజసింహ నరేంద్రకు వినతి పత్రం అందజేశారు.